# మాయాబజార్

ఆదివారం తొమ్మిదవుతోంది. ఏనాడో పెద్దవాళ్ళయి పోయిన నా పిల్లలింకా పక్కల మీదే దొర్లుతు

న్నారు. నాకు మాత్రం ఏ వారమైనా, వర్షమైనా తొమ్మిదికల్లా పని పూర్తి చేసి బయటపడాల్సిందే. ఆ అలవాటు కొద్దీ గబగబా వంటచేసి గంటకొట్టేసే ప్రయత్నంలో ఉన్నాను. నాకస్సలు చేతకానిదేమంటే ఏపనైనా స్థిమితంగా చేయడం. ప్రతీ పనీ ఎవరో తరుముకొస్తున్నట్లు చేసేస్తూ ఉండటం, ఆ హడావిడిలో ఎక్కడో చిన్న దెబ్బ తగుల్చుకుని అందరిచేతా చీవాట్లు తినడం. నామీద ఎగిరేప్పుడు మాత్రం ఇంటిల్లిపాదీ ఎక్కడలేని ఆపేక్ష చూపిస్తారు.

"ఒక కాఫీ చెప్పు!"

"ఆఁ! చెప్తా ఆశేష దాసదాసీ జనానికి ఇక్కడ చెప్తే వినేందుకెవరూ లేరని తెలిసీ కూడా కాఫీ చెప్పమనడం దేనికి? ఇవ్వమనచ్చుగా. ఇంట్లో కూడా నియోగమే. ఐనా, ఆదివారం కూడా తొమ్మిది లోపల నూట పదకొండు సార్లు కాఫీ తాగాలా?"

"ఇదిగో! నువ్వెలాగూ టిఫిన్లు చెయ్యావు. కాఫీ చెప్పడం కూడా ఏం కష్టం?"

"ఆహా! ఎంత చులాగ్గా చెబుతున్నారూ టిఫిన్లు కూడా చెయ్యనట. ఇడ్లీ తప్ప మీరు తినరు. దోసె తప్ప చిన్నది తినదు. ఉల్లిపాయ వేస్తే అత్తగారు తినరు. వేయకపోతే పుత్రరత్నం తినడు. ఉండేది నలుగురు. నలభై రుచులు. ఇక రోజూ పొద్దున్నే లేచి ఇడ్లీ, దోసె, వడ, పూరీ చేసుకుంటూ బ్రాహ్మణ ఫలహార మరియూ భోజనశాల నడుపుకోవటమే. ఫ్యాక్టరీకి వెళ్ళే పని లేదు. ఇంకా నయం. రెండు పూటలా వేడివేడిగా వండి పెడుతున్నా. సంతోషించండి! ఈ రోజుల్లో ఎంత డబ్బున్నా ఆడవాళ్ళకి వేరే పనులున్నా , లేకపోయినా అందరిళ్ళలోనూ వంట ఒక్కపూటే తెలుసా?"

ఇంక ప్లేటు మార్చేశారు. "ఔనూ, ఏమిటీవేళ డిఫరెంట్‌గా కనిపిస్తున్నావు!" నా కష్టార్జితం 550 రూపాయలు పోసి కొనుక్కువి, ఆదివారం కదా అని మనసుపడి కట్టుకున్న కొత్త చీరకి ఈ పెద్ద మనిషిచ్చే కాంప్లిమెంటు. బాగుందంటే ఈయనకేమన్నా పరువుతక్కువా?

"చీర కొత్తది"

"ఎవరు పెట్టారూ?"

"ఎవ్వరూ పెట్టలా, నేనే కొనుక్కున్నా. ఏం బాలేదా ?"

"ఫరవాలేదు. కానీ ఏదో కొత్తదిగా ఉంటేనూ!'

వెనకాలనించి భారతి నవ్వుతోంది. "లేదయ్యా. నిన్న చీరల సత్యం వచ్చాడు. ఎందుకమ్మగారూ, ఎపుడూ లేత రంగులే కడతారూ, ఈ వెంకటగిరి కెంపు మీద గళ్ళు అదిరిపోతున్నాయి. మీరు గావీ కడితే, అచ్చు లక్ష్మీ దేవిలా ఉంటారని" ఇచ్చిపోయాడు.

"పాపం, అసలు దేవత పేరు చెప్తే ఈవిడ కొనదవి లక్ష్మీదేవి పేరు చెప్పి ఉంటాడులే ".

"ఇదిగో కాఫీ, 10.30కి వచ్చి భోజనం చేయండి. మధ్యలో నన్ను డిస్టర్బ్ చెయొద్దు. నన్ను చూడలేక పోతే, కళ్ళు మూసుకోండి".

ఈయన అన్నారని కాదు గానీ, ఈ చీర కట్టుకున్నప్పటినించీ నాకే నేనులా అన్పించడం లేదు . ఎవరేం చెప్పినా నమ్మేస్తానేమిటి? ఛ! ఇంకోసారి ఆ సత్యం మాటలు విని బుట్టలో పడకూడదు. అందుకే ఏదైనా కొనేప్పుడు కాస్త ఎవరి సలహా ఐనా తీసుకోవాలి. ఇలాటి జరీ, గళ్ళూ, ముదురు రంగులు కట్టడం నాకస్సలు అలవాటు లేదు. మామూలుగా ఉదయం ఇంట్లోంచి బయటకొస్తే సాయంత్రం వరకు ఎన్ని పనులున్నా ప్రైంమినిస్టరిని కలవాలన్నా కూడా మళ్ళీ వేషం మార్చే పద్ధతి పెట్టుకోలేదు. అసలే నాది స్ఫురద్రూపం. నేను పనులమీద కలిసేవాళ్ళలో చాలామంది అర్భకులుంటారు. అక్కడికీ వాళ్ళు ఝడుసుకోకుండా ఉండాలని, సౌమ్యంగా కనిపించాలని లేత రంగులే కడతాను. వినయంగా వినపడాలని మాటిమాటికీ సార్ సార్ అని కూడా అంటూంటాను. అయినా అదేమిటోనాకు గర్వం అని పేరు పడిపోయా పదిమందిలో. ఈ జనాలు అహంకారానికీ, ఆత్మవిశ్వాసానికీ చాలా డిఫరెన్స్ ఉందంటే ఒప్పుకోరు మరి.

హాల్లోంచి అత్తగారు కేకేస్తున్నారు "అమ్మాయ్, శ్రీకృష్ణ వస్తోంది! త్వరగా రా, ఆనిక్కి చేసుకోవచ్చులే ఏమన్నా ఉంటే". నాలుగు వారాల్నుంచీ టీవీలో కుచేలుడి కష్టాలు చూపిస్తున్నారు. నాకేమిటో, కలర్‌లో కష్టాలు చూస్తే నిజం కష్టాల్లా అనిపించవు. అందుకే కుచేలుడు వచ్చినపుడు అత్తగారి గదిలోనూ, కృష్ణుడు వచ్చినపుడు హాల్లోనూ తిరుగుతూ ఎవరెవరి సౌజన్యంతో ఆ సీరియల్ చూస్తున్నామో, వాళ్ళకి పూర్తి న్యాయం చేస్తున్నా.

ఇంతలోకే ఎదురింటి వాళ్ళ పాప నీల వచ్చింది, చేతిలో కత్తి పుచ్చుకుని.

"ఏమిటే, కత్తుచ్చుకుని వచ్చావ్వూ, ఎవరి మీదకీ?"

"కాదాంటీ, మరేమో మా అమ్మమ్మ సోనీ బామ్మనడిగి అరిటాకు పట్రమ్మంది. బామ్మకి కత్తి కనిపిస్తుందో లేదో అని నేనే పట్టుకొచ్చా".

"ఇంతమంది మనవల్నెత్తిన ఈవిడ సోనీ బామ్మేమిటీ, తప్పు కదూ. కుక్కముండకి బామ్మలా కనిపిస్తున్నారా?"

"కాదాంటీ, ఇది సోనీ ఇల్లు, మీరు సోనీ ఆంటీ, ఆయన సోనీ అంకుల్, అలాగే సోనీ బామ్మ".

దాన్ని వాగిస్తే, ఇంకా ఏమేం చుట్టరికాలు కలుపుతుందో అని మాట్లాడకుండా టీవీ చూస్తూ కూచున్నా. ఇంతలోకే ఆవిడందుకున్నారు. "అరిటాకెందుకే మీ అమ్మమ్మకీ? బొబ్బట్లు చేస్తోందా?"

"అవును బామ్మా, తొమ్మిది బొబ్బట్లు చేస్తోంది".

"తొమ్మిదే! అన్నోటెందుకే అమ్మా?"

"నాకూ, అమ్మమ్మకీ, అమ్మకీ, నాన్నకీ, 4X2 = 8+1 శ్రీదేవికి. బొబ్బట్లు చేస్తున్నారా అనడిగితే చెప్ప మంది అమ్మమ్మ!"

నాకో పక్క వళ్ళు మండిపోతోంది. "ఏమిటా పిల్లదానితో సొద. మీకెందుకా కాపీర్ణం. మనమేమన్నా బొబ్బట్లెరగని మొఖాల్లాగా కనిపిస్తున్నామా ఆవిడకి?"

"కాదే. దాన్ని వాళ్ళ అమ్మా, అమ్మమ్మా కలిసి ఎలా పెంచుతున్నారో చూద్దామని అడిగానే!"

"పదవే నీలా. ఈ టూత్‌పేస్టుల వాళ్ళూ, క్రీములవాళ్ళూ వెళ్ళే లోపల భోజనాల బంతికి సరిపడా ఆకులు కోయచ్చు".

ఆ వచ్చిన పిల్ల మొవ్వలాంటి ఆకు, రెండు చేతులమీదా పరుచుకుని, మధ్యమధ్యలో ముఖానికి ఆన్చుకుంటూ గెంతుకుంటూ వెళ్ళిపోయింది.

నా కళ్ళు టీవీ మీద ఉన్నాయి కానీ, మనస్సు మాత్రం గురువారంవాడు భువనేశ్వర్ రైలెక్కిన మా సేల్స్ ఇంజనీర్ రమణ మీదే ఉంది. టెండర్ ఓపెనయ్యి నెల్లాళ్ళైంది. అప్పుడు నే భువనేశ్వర్‌వెళ్ళి అందర్నీ కలిసే వచ్చా. పర్చేజ్ సెక్షన్ వాళ్ళతో మాట్లాడటం కూడా అయ్యింది. మాదే అందరికన్నా లోయెస్ట్. ఈ టెండర్ ఎడ్వర్టైజ్‌మెంట్ కోసం ఆరునెలలు కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూడగా చూడగా వచ్చింది. అలాటి సిస్టమ్స్ మేం నాలుగేళ్ళనుంచీ సప్లై చేస్తున్నాం. అన్నీ లక్షణంగా పనిచేస్తున్నాయి. చాలా మటుకు ఎసెంబుల్ కూడా చేసి రెడీగా ఉంచాం. ఇంక ఆర్డర్ రావడమే తరువాయి. మొన్న ఫోన్‌చేసి డాక్టర్ రాఘవరావుగార్ని రిక్వెస్ట్ చేశా. "కొంచం తొందరగా ఫైనలైజ్ చేయండి సార్" అని. ఏమిటో మరి. "ఎవర్నన్నా పంపించండి!" అన్నారు.

"ఎందుకూ! స్టాక్ రెడీగానే ఉంది. ఆర్డర్స్ పోస్టు చేస్తే మనిషికిచ్చి వెంటనే సప్లై చేస్తా" నన్నాను.

"కాదమ్మా, స్పెసిఫికేషన్స్‌లో కొంత చిన్న మార్పులున్నాయి. టెక్నికల్ పర్సన్‌ని ఎవరైన్నా పంపండి", అంటే వెంటనే రమణని పంపించా. అతను మా దగ్గర మూడేళ్ళనించీ పనిచేస్తున్నాడు. డిప్లొమా హోల్డరే ఐనా మంచి తెలివిగల కుర్రవాడు. చాలా కష్టపడతాడు. ఇంకెన్నాళ్ళు అతని సర్వీస్ మాకు ప్రాప్తమో. కొంచెం పనిలో చెయ్యి తిరగ్గానే, మాలాటి చిన్న యూనిట్లలో పనిచేయడం వాళ్ళకి పరువుతక్కువగానూ, పురోభివృద్ధికి ఆటంకంగానూ కనిపిస్తుంది. ఏం చేస్తాం. దేశంలో నిజంగా ట్రైనింగ్ సెంటర్స్ అంటూ ఉంటే, అవి మాబోటివాళ్ళు నడిపే చిన్న యూనిట్లే. అతడ్ని వెళ్ళి రాఘవరావు గారిని కలవగానే ఫోన్

చెయ్యమన్నా. ఏన్న చేశాట్ట. నేను బైటకు వెళ్ళాను.

"ఏం చెప్పాడు రాజూ!", అంటే, "అక్కరలేని విషయాలు అడగొద్దన్నారు కదమ్మా. అందుకని మీరు లేరని పెట్టేశా. మళ్ళీ చేస్తామన్నారు".

ఇంతవరకూ అతీగతీ లేదు. బహుశా ఆర్డర్ టైపై ఉండదు. సోమవారం దాకా ఉండమన్నారో ఏమిటో. మళ్ళీ బోలెడు ఖర్చు. నా మనసంతా అందుకోబోయే ఆర్డర్ మీదా, రాబోయే డబ్బులమీదా, తీర్చబోయే అప్పుల మీదా విహరిస్తోంది.

బహుశా ఈ ఆర్డర్ వచ్చింది సార్! అని మా బ్యాంక్ వాళ్ళకి చూపిస్తే, పేమెంట్ ఎప్పుడు వస్తుందని అడుగుతారు కాబోలు. అస్సలు ఈ బ్యాంకు వాళ్ళని ఎవరు ట్రైన్ చేస్తారో.

"నీ కాల్మొ క్తా దొరసానీ!" పెద్దబట్టల మూటతో ఒక పదిహేనేళ్ళ కుర్రకుంక భుజం మీద చేయి వేసి ఆటో దిగి మా ఇంట్లోకి విజయం చేస్తోంది డెబ్బై ఏళ్ళ లంబాడీ నారీ రత్నం జంగూబాయి. ఆ మూట హాల్లో పడేసి అక్కడే గోడకానుకుని సెటిలయిపోయింది. మేం వెనకటికి అద్దె ఇంట్లో ఉన్నప్పుడు మా ఇంటికి దగ్గరలో లంబాడీలు ఒక వంద కుటుంబాలు ఉండేవాళ్ళు. ఆవీధిలో మేం ఒక్కరమే టీవీ చూడ్డానికి ఎవరైన్నా రానిచ్చే వాళ్ళం. ఆదివారం సాయంత్రం అయ్యేప్పటికి ఆ ఇళ్ళలోనించి బోలెడు మంది పిల్లా మేకా వచ్చి కూచుని సినిమా చూసి పోయేవాళ్ళు. పాపం మా అత్తగారు వాళ్ళకోసం వేరుసెనగకాయలు, జంతికలు కూడా పెట్టేవారు. ఆ కుటుంబాలన్నింటికీ జంగూబాయే అధినాయకురాలు. ఆరుగురు ఆడ పిల్లలు. ఆరుగురు మగపిల్లలని సాక్షాత్తు కన్న తల్లి. చక్కచక్కని పిల్లో కవర్లు, కుషన్ కవర్లు కుట్టి, వాళ్ళ ఆడ వాళ్ళచేత కుట్టించి అమ్ముతుండేది. అది తిరగని ఊరు లేదు. వెళ్ళని ఎగ్జిబిషను లేదు. అన్నీ ఎంపోరియాలకీ సప్లై చేసి కుటుంబ భారమంతా ఒక్క చేతి మీద మోసేది. కానీ, ఏమిటో ఎప్పుడూ దానికీ డబ్బు ఇబ్బందే. నెలకోసారి మా ఇంటికొచ్చి మూటెడు కుషన్ కవర్లు పడేసి, చుట్టాలొచ్చారు. కోళ్ళు కోయాలని రెండు మూడు వందలు పట్టుకుపోయేది. మళ్ళీ రెండు రోజుల్లోవచ్చి డబ్బులిచ్చి మూట పట్టుకుపోయేది. ఈ గోలేమిటి నాకు అని విసుగ్గా ఉన్నా, కుటుంబంకోసం అది పడే తాపత్రయం చూసి ఏమీ అనలేకపోయేదాన్ని. ఆ అద్దె ఇల్లు వదిలేసి ఇరవై ఏళ్ళైనా, అది మాత్రం నన్ను వదలలేదు.

"ఏం తల్లీ!! పొద్దున్నే నా మీద దండయాత్ర చేశావు. నేనిలా ఉండటం కూడా నీ కిష్టంలేదా??"

"నీ కాల్మొక్కుతా దొరసానీ. అంతమాట అనకు !"

"నేనే నీ కాల్మొక్కుతా కానీ, ఈ వాళ నన్ను దయతలచి వదిలేయి! నాకుండేదే నెలకొక్క ఆదివారం. పైగా చేతిలో దమ్మిడీ లేదు. ఎంచక్కా ఏ జూబ్లీ హిల్స్‌లోనో, బంజారా హిల్స్‌లోనో తిరక్క నా ప్రాణా

లెందుకు తీస్తావు? మా ఇల్లు చూడు. ఎంత వాటంగా ఉందో? ఈ కొంపకి షోకులెందుకు?"

"ఎట్లజెప్తవ్ దొరసానీ. మనతాన పైసలేడికి పోతయి? నేనేమన్నా నిన్ను పైసలడిగిన్నా? నా పనితనం చూసిమెచ్చేటోళ్ళు కావాల! నేనందరింటికెందుకుపోత? ఇసుమంటి పని మెచ్చాల్నంటే దిమాక్‌తో బాటు దిల్ కూడ ఉండాలె! ఎన్ని దినాలసంది నిన్ను సూద్దమని గుబులయితది కానీ ఒక్కటే కాళ్ళ నెప్పులు. చాతనైతలేదు. సిన్న అల్లుడు ఆటో తీసిండు. పోయిరావే అత్తా అని ఈన్నిచ్చి తోలిండు".

"ఏం, నీ కొడుకులేమైనారు?"

"ఏం కొడుకులు దొరసానీ? కూసొమంటే నించుంటరు. నించోమంటే కూసుంటరు. ఆండ్ల పెండ్లాలు నడవమంటే పరుగులు పెడతరు, దూపయితంది. ఓ బిడ్డా బారాతి! జర నీళ్ళుపోయి నాయినా. సక్కెర వేయమాక బేటా".

వెంటనే ఇకిలించుకుంటూ భారతి నాలుగు బ్రెడ్డు ముక్కలు, రెండు మగ్గుల చాయి తెచ్చి వాళ్ళ పక్కన పెట్టి మూట విప్పసాగింది. చచ్చేంరా జీవా. ఇక పన్నెం డైనా సరే. ఏదో ఒకటి కొనకుండా ఇది నన్ను వదలదు. ఎప్పుడూ మూడు నాలుగు నెలలకోసారి పెద్ద మూటతో ఆదివారమో, మరి ఏ పండగ పూటో పొద్దున్నే వచ్చేస్తుంది. ఇంక ఆవాళ నాకు అవసరమున్నా లేకపోయినా, ఓ రెండు బెడ్ స్ప్రెడ్స్, నాలుగైదు కుషన్ కవర్స్ మాకోసమే కుట్టానని చెప్పి అదే సెలెక్ట్ చేసి , అదే ధర కూడా నిర్ణయించేసి, డబ్బులకెపుడొచ్చేదీ తేల్చేసి, అవి హాలులో దివాన్ మీద పడేసి వెళ్ళిపోతుంది.

ఇంతలోకే తన సిగిరెట్ పెట్టె ఏమైంపోయిందోనని వెతుక్కుంటూ ఈయన హాలులోకి వచ్చారు.

"ఏం దొరా? మంచిగున్నవా. మా ముసిలోడు రోజూ నిన్ను యాద్ చేస్తడు. నువ్విచ్చిన అంగీలు చూసుకుని?"

"ఏం నువ్వు కూడా మీ ఆయనకేం కొనవా ?"

"ఏం కొనాలె దొరా? అంతా ఆగమయిపోయే. సిన్నోడు ఏ పనీ సేస్తలేడు. మొన్న వాని బిడ్డకి పెండ్లి సేసిన. ముప్పై వెయ్యిలయినయి. మా ఆడోళ్ళు మునుపటి లెక్కన పనిసేస్త లేరు. మొన్న ఢిల్లీలో వారముండి అచ్చినం. యిరవై వెయ్యిల సరుకు కూడా పోలే. వూకే సూస్తరు. బోతరు. సూస్తరు. బోతరు. ఇదే సర్కారోళ్ళ అంగట్ల ఎంతంటే అంతిచ్చి కొంటరు. నీ కాల్మొక్కతా రెండు అంగీలియ్యవా?"

ఇంకేముందీ? ఈయనకి నేను తప్ప ప్రపంచంలో ఆడవాళ్ళంటే ఎక్కడలేని జాలి. అందులోనూ, కష్టపడే ఆడవాళ్ళంటే ఆయనకి చాలా గౌరవంట. మరి నేనేకేసో? రెండు శుభ్రమైన చొక్కాలు పట్టుకొచ్చి యిచ్చేశారు. నేను లోపలికెళ్ళి వేసుకున్నా "మీకేవిటి దాన్ని చూస్తే అంత ఇది? మనకన్నా బాగానే ఉంది. తెలుసా?

ఒక్క రూపాయి అప్పులేదు. ఊరికే పేదారుపులు అరుస్తుంది. దాని మాటలు నమ్మకండి!"

"పోన్లెస్తూ! పెద్దది. మనింటికొచ్చింది. ఏదో ఒకటి తీసుకుని పంపేసి, నాకు వడ్డించు".

బయటికొచ్చా. చిన్నదానికి వర్ణిస్తోంది. "సూడు కోడలు పాపమ్మా. ఈ పింకు మీద అందరూ బులుగు బాగుండదన్నారు. నేనే డిజైను పుస్తకాలలో సూసి, మన అమ్రిక పాపమ్మ కోసం మూడు నెల్ల సంది కుట్టుకచ్చిన. ఇసుమంటి పని ఏడనన్నా సూపియ్యి. మొన్న శాలిని రెడ్డమ్మ వచ్చి అడిగితే కూడ ఇయ్యలే. మన పాపమ్మ ఆడ ఇది వాడిందంటే, ఇక మనకన్నీ అమ్రిక ఆడార్లే!"

"ఇంతకీ ఎంత చెప్తున్నావు ?"

"అందరికీ పన్నెండు వందలు మనకయితే 1120. ఇగో దొర్సానీ నే పోతన్నా, బుదారం ఈ పిల్లగాని దోలిస్త. జర ముసిలోన్ని దవాఖానకు కొంచెం పోవాలె", ఇవ్వవలసిన డబ్బు తల్చుకుని నా ప్రాణం విల విల్లాడినా ఆ అందమైన బెడ్ స్ప్రెడ్‌ని అమ్రికా పాపమ్మనీ తల్చుకునేప్పటికి నాకు బుర్ర పనిచేస్తేగా ఈ లోపలే అది మూట కట్టేసి చల్ బేటా అని ఆటో ఎక్కి తుర్రుమంది. నిజంగా దీనికి మార్కెటింగ్‌లో గౌరవ డాక్టరేట్ ఇవ్వచ్చు.

పన్నెండుకల్లా అందరి భోజనాలయిపోయాయి. ఏం మాట్లాడుతున్నా, ఏం చేస్తున్నా నా మనసంతా భువనేశ్వర్‌నించి రావాల్సిన కాల్ మీదే ఉంది. ఇంతలో ఫోన్ మోగింది.

"మేడమ్! మా ఎం.డి. మిసెస్ అనితా అగర్వాల్ మాట్లాడుతారట, లైన్‌లో ఉండండి!" పదినిమిషాలు ఫోన్ పట్టుకుని వేళ్ళాడాక అవతలి నుంచి వినిపించింది "హల్లో గుడ్‌డే డాక్టర్, నాకు కంగ్రాట్స్ చెప్పండి!"

"ఏమిటి విశేషం?"

"మొన్న యామ్‌స్టర్‌డామ్ ట్రేడ్‌ఫేర్‌లో మేం పార్టిసిపేట్ చేశాం కదా. ఇప్పుడే మా ఎక్స్‌పోర్ట్స్ జీ.ఎం. కాల్ చేశారు. మాకు 2 మిలియన్ యు.ఎస్. డాలర్స్ కాంట్రాక్ట్ వచ్చిందిట. మనం రాత్రి అంజుమన్‌లో డిన్నర్‌కి కలుద్దాం. 8.30 షార్ప్. మీ దిల్(డాటర్-ఇన్-లా)ని కూడా తీసుకురండి!"

నాకూ ఆవిడకూ ఎందులోనూ సాపత్యం లేకపోయినా అందర్నీ ఏకం చేసే లయనెస్ క్లబ్బుల పుణ్యమా అని ఇంట్లోనే పి.ఏ.ని పెట్టుకోగల స్తోమత ఉన్న వాళ్ళు కూడా నాకు బాగా పరిచయమయ్యారు. ఇంక ఫోన్ వచ్చేటట్లు లేదులే అని అన్నీ సర్దుకుని మధ్యాహ్నం నిద్రకు ఉపక్రమించా. ఎవరోగానీ, చాలా కరెక్ట్‌గా చెప్పాడు. మిత్రులెప్పుడూ భోజనాలవేళ, శత్రువులెప్పుడూ నిద్ర వేళ వస్తారని. నిజమేనంటూ మోగింది ఫోన్. మా సేల్స్ ఇంజనీర్‌నించి. భువనేశ్వరేమోనని గట్టిగా అరుస్తున్నా "ఏమిటి? విన్నా మొన్నా చెయ్య లేదు?"

"నెమ్మదిగా మాట్లాడండి మేడమ్. హైదరాబాద్ నించే మాట్లాడుతున్నా!"

"అదేమిటి? ఎప్పుడొచ్చారు ?ఆర్డర్ ఇచ్చారా?"

"మనకి రాలేదు మేడం. సెకండ్ లోయెస్ట్‌కి ఇచ్చారు. మీతో మాట్లాడారట కద మేడం?'

"మన స్పెసిఫికేషన్స్ కొంచెం మార్చాచుమన్నారు. సరే, మీరెటూ వెళుతున్నారు కదా అని మనిషొస్తున్నాడు కదా అన్నాను!"

"అది కాదు మేడం, మీరు అర్థం చేసుకోలేదు. మేమేమన్నా చెప్తే మీకు కోపం వస్తుంది. ఆయన మీకు బాగా తెలిసిన వాళ్ళన్నారు!"

"అవును. ఎన్నో ఏళ్ళనించీ సప్లై చేస్తున్నాము కదా, బాగానే తెలుసు!"

"ఏం లాభం మేడం? అవతల వాళ్ళు వాళ్ళ అబ్బాయికి స్కూటర్ కొనిచ్చారు. ఆయన నన్ను చూసి పైగా కేకలేశారు. టూ అవర్స్ వెయిట్ చేస్తే కానీ, నాకు ఇంటర్వ్యూ ఇవ్వలేదు. మీది ఫినిషింగ్ బాగా లేదయ్యా! సర్వీసింగ్ ఫెసిలిటీస్ కూడా సరిగ్గా లేవు. మీ మేడంతో చెప్పు. అన్నారు. అక్కడనించీ మళ్ళీ ఫోన్ ట్రై చేస్తే మీరు దొరకలేదు మేడం, అందుకని వచ్చేశా!"

"సర్లెండి! రేపు ఆఫీసులో కలుద్దాం" అని ఫోన్ పెట్టేశాను.

ఏమిటీ దారుణం. ఎంతో పెద్దమనుష్యులనుకున్నవాళ్ళు ఎలా చెయ్యగలుగుతున్నారిలా? అంత పెద్ద సైంటిస్ట్‌ని ఇదుంచండి సార్ అని ఎలా అనగలను? అక్కడికీ ఏదన్నా గిఫ్ట్ కొందామనుకుంటే నే వెళ్ళేరోజున బ్యాంక్‌లో డి.పి. లేకపొయ్యింది! రా మెటీరియల్స్, వర్కర్స్ ఉంటే ఇండస్ట్రీలు నడుస్తాయనుకుంటారు మా బ్యాంకు వాళ్ళు. ఎంత పొరబాటు జరిగిపోయింది. కల్పవృక్షంలాటి డిపార్ట్‌మెంట్ పరాధీనమైపోయింది. నాతో మాట్లాడాను. మాట్లాడానంటారు. నాతో ఏం మాట్లాడారు? ధరలెక్కువయ్యాయి. కష్టంగా ఉంటోంది మేడం అన్నారు. గవర్నమెంట్ కేం కష్టమండి, ఐనా మాదే లోయెస్ట్ కదా అన్నాను. అంటే...అంటే.. ఏంటో అనుకున్నాను. ధరలెక్కువయ్యాయి అంటే, అంత పెద్ద ఆఫీసరు! ఛ!! నన్ను ట్యూబ్‌లైట్ అని అందరూ ఎందుకు పిలుస్తారో అప్పుడర్థమయ్యింది. దేవుడా! నన్ను అనితా అగర్వాల్ లా కాకపోయినా కనీసం జంగూబాయిలాగా అయినా పుట్టించకుండా, బొత్తిగా బిజినెస్ భాషరాని టెక్నోక్రాట్‌గా ఎందుకు పుట్టించావురా ?